## హామీల అమలు చేతగాకనే అరెస్టులు

కోటపల్లి, మార్చి 19 : కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ఇచ్చిన ఆరు గ్యారెంటీలు అమలు చేతగాకనే అక్రమ అరెస్టులకు పాల్పడుతున్నదని బీఆర్ఎస్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర బడ్జెట్ ప్రవేశపెడుతున్న నేపథ్యంలో మంచిర్యాల జిల్లాలో చెన్నూర్, కోటపల్లి, కాసిపేట తదితర మండలాల్లో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలను ముందస్తుగా పోలీసులు అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్లకు తరలించారు. అభివృద్ధి పనుల బిల్లులు ఇవ్వాలని కోరుతూ అసెంబ్లీకి తరలిన మాజీ సర్పంచ్‌లను కూడా అదుపులోకి తీసుకున్నారు. మరికొందరిని హౌస్ అరెస్ట్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వ తీరును నిరసిస్తూ నాయకులు నినాదాలు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజలను మోసం చేసే బడ్జెట్ అని విమర్శించారు. రానున్న రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెబుతారని హెచ్చరించారు.




కోటపల్లి పోలీస్‌స్టేషన్‌లో నినాదాలు చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

## లాంగ్‌వాల్ ప్రాజెక్ట్ రద్దు చేయాలని సీఎండీకి వినతి

బెల్లంపల్లి, మార్చి 19 : మందమర్రి ఏరియా శాంతిఖని లాంగ్‌వాల్ ప్రాజెక్ట్‌ను రద్దు చేయాలని ప్రాజెక్ట్ వ్యతిరేక పోరాట సమితి నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం హైదరాబాద్‌లో సింగరేణి సీఎండీ బలరాంకు వినతిపత్రం సమర్పించారు. ప్రాజెక్టు ప్రభావిత బట్వాన్ పల్లి, పెర్కపల్లి, ఆకెనపల్లి, లింగాపూర్, తాళ్ల గురిజాల గ్రామాల్లో భూగర్భ జలాలు తీవ్రంగా పడిపోయి, ప్రభావిత ప్రధాన జీవనాధారమైన వ్యవసాయానికి సాగునీటికి నోచుకోదని ఆవేదన వ్యక్తం చేశారు.



సీఅండ్ఎండీ బలరాంకు వినతిపత్రం సమర్పిస్తున్న ప్రాజెక్ట్ వ్యతిరేక పోరాట సమితి నాయకులు

**ఉత్త మాటలే..**

# అంకెల గారడీ

**సీఎం, డిప్యూటీ సీఎంలు హామీ ఇచ్చినా బడ్జెట్‌లో కేటాయింపులు నిల్**

- ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు మొండిచేయి.. సీఎం రేవంత్ దత్తత మాట వట్టిదే..
- ఇచ్చిన హామీలను కూడా మరచిన కాంగ్రెస్ సర్కారు
- మళ్లీ జిల్లావాసులకు నిరాశే.. ఈసారి ఇచ్చింది శూన్యం..
- అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశపెట్టిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క






మంచిర్యాల, మార్చి 19(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ''ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాను దత్తత తీసుకుంటా.. అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చేస్తా..'' ఇది రేవంత్‌రెడ్డి సీఎంగా బాధ్యతలు చేపట్టాక ఇంద్రవెల్లిలో తొలి సభ నిర్వహించి చేసిన ప్రకటన. మొన్నటికి మొన్న ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలోనూ జిల్లా అభివృద్ధికి కట్టుబడి ఉన్నానంటూ చెప్పుకొచ్చారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కూడా పాదయాత్ర సందర్భంలోనూ ఉమ్మడి జిల్లాకు ఎన్నో హామీలు ఇచ్చారు. సీఎం, డిప్యూటీ సీఎంల మాటలు ఉత్త ముచ్చటగానే మిగిలిపోయాయి. రాష్ట్ర ప్రభుత్వ గతేడాది బడ్జెట్‌లో, ప్రస్తుత బడ్జెట్‌లో ప్రత్యేకంగా చేసిన కేటాయింపులు ఏమీ లేవు. పెండింగ్ ప్రాజెక్టులకు నిధులు కేటాయించలేదు. గత బడ్జెట్‌లో మాదిరిగానే ఈసారి కూడా జిల్లాకు కాంగ్రెస్ సర్కారు మొండిచేయి చూపిందని జనం మండిపడుతున్నారు.

**మంచిర్యాలకు ఇచ్చింది ఏం లేదు..**

మంచిర్యాల జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టులకు నిధులు కేటాయింపు అంశాన్ని ఈసారి కూడా సర్కారు లెక్కలోకి తీసుకోలేదు. పక్క జిల్లాలో మంత్రి శ్రీధర్‌బాబు మినీ కాళేశ్వరానికి వందల కోట్లు కేటాయించిన సర్కారు.. చెన్నూర్ నియోజకవర్గానికి సాగు, తాగు నీరు అందించేందుకు గత ప్రభుత్వం శంకుస్థాపన చేసిన చెన్నూర్ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్, మంచిర్యాలలో లక్షెట్టిపేట, హాజీపూర్ మండలాలకు సాగునీరు అందించే పడ్తనపల్లి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్‌లను అసలు బడ్జెట్‌లోనే ప్రస్తావించలేదు. హైదరాబాద్ జనాల తాగు నీరు, ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు సాగునీరు అందించే ఎల్లంపల్లి ప్రాజెక్టు నిర్వహణకు మాత్రమే డబ్బులు విడుదల చేసి చేతులు ఎత్తేసింది. మంచిర్యాల టౌన్‌లో బ్యాక్ వాటర్ ప్రొటెక్షన్ వాల్ కోసం రూ.100 కోట్లు ప్రతిపాదించింది. గత బడ్జెట్‌లోనూ రూ.255కోట్లు అంటూ ప్రచారం చేసినా.. ఆ పనులు ఇసుమంతైనా ముందుకు కదల్లేదు. దీంతో ఈసారి కూడా నిధుల కేటాయింపు నామమాత్రమేనా అనే సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. జిల్లాలోని ర్యాలీవాగుకు రూ. ఒక కోటి, నీల్వాయి వాగుకు రూ.13 కోట్లు బడ్జెట్‌లో చూపించింది. ఇవి కేవలం ప్రాజెక్టుల నిర్వహణ కోసమే చేసింది తప్ప.. పెండింగ్‌లో ఉంటూ వస్తున్న ర్యాలీ వాగు, నీల్వాయి వాగుల ఆయకట్టు స్థిరీకరణకు నిధులు ఇవ్వలేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇక బీఆర్ఎస్ హయాంలో చెన్నూర్, బెల్లంపల్లి, లక్షెట్టిపేటలో 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రులను నిర్మించింది. గత ప్రభుత్వ హయాంలో వాటికి ప్రత్యేక నిధులు కేటాయించింది. కాంగ్రెస్ గెలిచాక వాటి ఆలనా.. పాలనా చూసేవారు లేకుండా పోయారు. సిబ్బంది ఖాళీల భర్తీ, సరైన సదుపాయాల కల్పనను ఈ బడ్జెట్‌లో నిధులు వస్తాయనుకుంటే పెద్దగా ఇచ్చింది ఏం లేకుండా పోయింది. విద్యారంగానికి నియోజకవర్గానికి ఒక యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూళ్లు నిర్మించనున్నట్లు గతంలో చేసిన ప్రకటనలే తప్ప కొత్తగా కేటాయింపులు ఏం చేయలేదు. దీంతో అన్ని వర్గాల ప్రజలు సర్కార్ తీరుపై మండిపడుతున్నారు. జిల్లాకు ప్రత్యేక నిధులు ఏవంటూ ప్రశ్నిస్తున్నారు.

### విద్యారంగంపై సవతితల్లి ప్రేమ



ఎన్నికల మ్యానిఫెస్టోలో విద్యారంగానికి 15 శాతం నిధులు కేటాయిస్తామని చెప్పిన రేవంత్‌రెడ్డి సర్కారు ఈ బడ్జెట్‌లో కేవలం 7.5 శాతం నిధులే కేటాయించింది. విద్యారంగంపై సవతి తల్లి ప్రేమ చూపిస్తుంది అనడానికి ఇదే నిదర్శనం. ఈ ప్రభుత్వానికి ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నా ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు విద్యారంగానికి బడ్జెట్ ఇవ్వాల్సిన అవసరం ఉంది. ఉమ్మడి జిల్లాకు ఒక యూనివర్సిటీ ఇస్తానని ముఖ్యమంత్రి ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాన్ని నిలబెట్టుకునేలా కేటాయింపులు చేయకపోవడం దారుణం. ఇప్పటికైనా విద్యారంగానికి 20 శాతం నిధులు కేటాయించాలి. లేనిపక్షంలో బీఆర్ఎస్‌వీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపట్టడంతోపాటు అసెంబ్లీని ముట్టడిస్తాం.

*- బడికెల శ్రావణ్, బీఆర్ఎస్‌వీ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు.*

### ఆసిఫాబాద్ జిల్లాకు ప్రయోజనం శూన్యం

కుమ్రం భీం ఆసిఫాబాద్, మార్చి 19 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాకు ఎలాంటి ప్రయోజనం లేదని ప్రజా సంఘాల నుంచి విమర్శలు వెల్లువెత్తాయి. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ నాయకులు జిల్లాకు ఇచ్చిన హామీల్లో ఒక్కటి కూడా నెరవేర్చేందుకు నిధులను కేటాయించలేదన్నారు. వార్ధ వంతెన, గుండి వంతెన నిర్మాణం, గిరిజన గ్రామాల్లో మౌలికల వసతుల కల్పనకు ఎలాంటి నిధులు ప్రకటించలేదని మండిపడ్డారు. కాంగ్రెస్ గొప్పగా చెప్పుకునే ఆరు గ్యారెంటీల అమలుకు కూడా ప్రత్యేకంగా ఎలాంటి నిధులు కేటాయించకపోవడంతో సిగ్గుచేటన్నారు. రైతులు, కార్మిక వర్గాల సంక్షేమంపై ప్రభుత్వం బడ్జెట్ కేటాయింపుల్లో పూర్తిగా నిర్లక్ష్యం చేసిందన్నారు. రైతు బంధు లాంటి పథకాల అమలుకు గత ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులను కేటాయించిందని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం కనీసం వాటికి కూడా నిధులు కేటాయించకపోవడంపై అన్ని వర్గాల నుంచి విమర్శలు వస్తున్నాయి.

### రైతులను విస్మరించిన కాంగ్రెస్



కేసీఆర్ ప్రభుత్వం రైతు బంధుకు ప్రత్యేకంగా నిధులను కేటాయించేది. కాని కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసా పెంపునకు ఎలాంటి నిధులను ప్రత్యేకంగా కేటాయించలేదు. ఇప్పటికే రైతులు రెండు పంటలకు అందాల్సిన రైతు భరోసాను కోల్పోయారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి రైతుల సంక్షేమంపై ఏమాత్రం చిత్తశుద్ధి లేదు. పెట్టుబడి రైతులు మళ్లీ అప్పులు చేయాల్సి వస్తున్నది. దిగుబడి రాక అప్పులు తీర్చలేక ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. కాంగ్రెస్ మాయ మాటలు నమ్మి గెలిపించినందుకు రైతులు నిండా మునుగుతున్నారు.

*-మడావి రఘునాథ్, రైతు సంఘం నాయకుడు, కెరమెరి*

### నిధులేవి?



మంచిర్యాల జిల్లాకు సంబంధించి గత ప్రభుత్వం చేపట్టిన ఏ అభివృద్ధి పనులకు ఈ బడ్జెట్‌లో నిధులు ఇవ్వలేదు. చెన్నూర్ లిఫ్ట్ ఇరిగేషన్, పడ్తనపల్లి లిఫ్ట్ ఇరిగేషన్ ఇలా దేనికి నిధులు లేవు. పోనీ కాంగ్రెస్ సర్కార్ ఇచ్చిన ఆరు గ్యారెంటీల గురించైనా ప్రస్తావించిందా అంటే అదీ లేదు. తొలి బడ్జెట్‌లో చెప్పిన రుణమాఫీ లెక్కలకు ఇప్పుడు చేసినట్లు చెప్తున్న రుణమాఫీకి పొంతనే కుదరడం లేదు. ఉద్యమ కారులకు ఇస్తామన్న రెండు గుంటల భూమి లేదు, ఇల్లు కట్టుకునేందుకు డబ్బులు లేవు. మహిళలకు స్కూటీలు లేవు, రూ.2500 లేవు. పింఛన్లు లేవు.. ఏం లేవు. డప్పు కొట్టుకోవడం తప్ప ఇచ్చిన హామీల ఊసే లేదు. ఈ బడ్జెట్ అంకెల గారడీ తప్ప దీంతో జనాలకు ఒరిగే మేలు ఏం లేదు.

*- గోగుల రవీందర్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు*

### విద్యా, వైద్య రంగాలకు ప్రాధాన్యం ఏది ?



ఆసిఫాబాద్ వంటి మారుమూల గిరిజన జిల్లాల్లో వైద్య వసతులను మెరుగుపరిచేందుకు ఎలాంటి నిధులను కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టలేదు. కనీసం కుమ్రం భీం ప్రాజెక్టు కట్టకు కూడా మరమ్మతులకు కూడా నిధులు కేటాయించకపోవడం సరికాదు. ఈ ప్రాజెక్టు ఆయకట్టుకు నీరందక వేలాది ఎకరాల భూములు బీడుగా మారుతున్నాయి. జిల్లాలోని మెడికల్ కళాశాలలో సరిపడా సిబ్బంది లేరు. జిల్లాలో వైద్య శాఖలో పోస్టులు ఖాళీలుగా ఉన్నాయి. చాలా వరకు హాస్టళ్లకు సొంత భవనాలు లేవు. జిల్లాపై కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నది.

*- దుర్గం దినకర్, సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు*

### కార్మిక, కర్షకులకు ప్రయోజనం శూన్యం



కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ బడ్జెట్ బడా బాబులకు, బడా వ్యాపారులకు, కార్పొరేటర్లకు తప్ప సాధారణ కార్మికులు, కర్షకులకు ఏమాత్రం ప్రయోజనం కలిగించేదిగా లేదు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకైనా ప్రభుత్వం నిధులు కేటాయించలేదు. రైతులకు, సంఘటిత రంగాల వర్గాల వారికి ప్రయోజనం లేదు. జిల్లాలోని ఏ ఒక్క రంగానికి కూడా బడ్జెట్‌లో ప్రత్యేకంగా నిధులను కేటాయించలేదు.

*- బోగె ఉపేందర్, ఏఐటీయూసీ కార్యవర్గ సభ్యుడు*

### కుప్టీ, చనాక-కొరాట ప్రాజెక్టులకు నిధులు మంజూరయ్యేనా?

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఆదిలాబాద్ జిల్లా ప్రాజెక్టులకు నిధుల మంజూరు విషయంలో సందిగ్ధత నెలకున్నది. రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క తన బడ్జెట్ ప్రసంగంలో జిల్లాలోని పెండింగ్, ప్రస్తుత ప్రాజెక్టుల గురిం చి ప్రత్యేకంగా ప్రస్తావించ లేదు. మహారాష్ట్ర సరిహద్దులో గల పెన్‌గంగాపై కేసీఆర్ ప్రభుత్వం ప్రారంభించిన చనాక-కొరాట ప్రాజెక్టు పనులు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో కి వచ్చినప్పటి నుంచి నిలిచిపోయాయి. 2023 ఆగస్టులో కేసీఆర్ ప్రభుత్వం ప్రాజెక్టుల ట్రయల్ రన్ విజయవంతంగా నిర్వహించింది. ప్రధాన కాలువ పనులు పూర్తికాగా.. పిల్ల కాలువల పనుల నిర్మాణానికి నిధులు కేటాయించాల్సి ఉండగా కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. 52 వేల ఎకరాలకు సాగు నీరు అందించే ఈ ప్రాజెక్టు పనుల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అలాగే కడెం ప్రా జెక్టుకు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌గా ఉండడమే కాకుండా ఆదిలాబాద్ జిల్లాలో వేలాది ఎకరాలకు సాగు నీరు అందిం చే కుప్టీ ప్రాజెక్టు నిర్మాణంపై కూడా నీలినీడలు కమ్ముకుంటున్నాయి. గత బడ్జెట్‌లో కుప్టీ ప్రాజెక్టు నిర్మాణంలో భాగం గా భూ సేకరణ కోసం రూ.237 కోట్లు మంజూరు చేసినట్లు ప్రభుత్వం ప్రకటించింది. గతేడాది బడ్జెట్‌లో మంజూరు చేసిన నిధులు విడుదల చేయకపోగా.. ఈ బడ్జెట్‌లో కూడా మొండిచేయి చూపుతుందని స్థానికులు మండిపడుతున్నారు. గిరిజనాభివృద్ధికి తక్కువ నిధులు కేటాయించడంపై వారు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.



దివ్యాంగ విద్యార్థికి సహాయ ఉపకరణాలు పంపిణీ చేస్తున్న కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

## దివ్యాంగులకు చేయూతనందించాలి

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, మార్చి 19: దివ్యాంగులను గౌరవిస్తూ, వారికి చేయూతనందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే పిలుపునిచ్చారు. బుధవారం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో అలింకో సంస్థ ఆధ్వర్యంలో దివ్యాంగ విద్యార్థులకు ట్రై సైకిళ్లు, వినికిడి యంత్రాల పంపిణీ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అలింకో స్వచ్ఛంద సంస్థ వారు జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలను సందర్శించి 136 మంది దివ్యాంగ విద్యార్థులను గుర్తించి వారికి ట్రై సైకిళ్లు, వినికిడి యంత్రాలు ఇతర ఉపకరణాలను అందించడం అభినందనీయమన్నారు. అనంతరం దివ్యాంగులకు ఉపకరణాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో అలింకో స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి గౌరవ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

**ఎల్ఆర్ఎస్ ప్రక్రియను వేగవంతం చేయాలి**

కాగజ్‌నగర్, మార్చి 19 : లే-అవుట్ భూముల క్రమబద్ధీకరణలో భాగంగా ప్రభుత్వం చేపట్టిన ఎల్ ఆర్ ఎస్-2020 పథకంలో అర్హులైన వారి నుంచి రుసుము వసూలు ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే ఆదేశించారు. బుధవారం కాగజ్ నగర్ మున్సిపల్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లాతో కలిసి వార్డు అధికారులు, మున్సిపల్ అధికారులు, రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ నెల 31వ తేదీలోగా 100 శాతం రుసుము చెల్లించినట్లయితే అందులో 25 శాతం మినహాయింపు ఉంటుందని తెలిపారు. ఈ పథకంపై ఈ 10 రోజుల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలని తెలిపారు. అనంతరం కాగజ్‌నగర్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన 10వ తరగతి పరీక్షా కేంద్రానికి వెళ్లి విద్యార్థులకు కల్పించనున్న వసతులు, ఏర్పాట్లను పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. ఆయన వెంట తహసీల్దార్ కిరణ్ కుమార్, మున్సిపల్ కమిషనర్ అంజయ్య, వార్డు అధికారులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

## చివరి ఆయకట్టుకు సాగునీరందించాలి

**మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్**

నస్పూర్, మార్చి 19 : జిల్లాలోని ప్రాజెక్టుల కింద చివరి ఆయకట్టు వరకు పంటలకు సాగునీరందించాలని అధికారులను మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ప్రాజెక్టుల పరిధిలో చివరి ఆయకట్టు వరకు సాగునీరందించేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఎల్లంపల్లి ప్రాజెక్టులో ప్రస్తుతం నీటి నిల్వ 11.4 టీఎంసీలు ఉందని, కార్యాచరణ ప్రకారం నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు. సుందిల్ల, అన్నారం, గూడెం ఎత్తిపోతలు, ఇతర మధ్య, చిన్న తరహా ప్రాజెక్టుల నుంచి నీటిని విడుదల చేసేందుకు ప్రణాళిక రూపొందించాలని, నీల్వాయి ప్రాజెక్టు పనులు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. జూన్ 15 వరకు చర్యలు చేపట్టాలని తెలిపారు. నీరు తక్కువగా వినియోగించే వాణిజ్య ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. తాగునీటి ఎద్దడి నివారణకు ప్రత్యేక కార్యాచరణ అమలు చేయాలని ఆదేశించారు.



జైపూర్ : శివ్వారంలో పొలాలను పరిశీలిస్తున్న కలెక్టర్ కుమార్‌దీపక్

**సాగుకు సహకారం అందిస్తాం**

జైపూర్, మార్చి 19: జిల్లాలో వ్యవసాయ రంగానికి సహకారం అందిస్తామని కలెక్టర్ కుమార్‌దీపక్ అన్నారు. బుధవారం జైపూర్ సుందిల్ల బ్యారేజ్, శివ్వారం గ్రామ సమీపంలోని గోదావరి పరివాహక ప్రాంతాల్లో తహసీల్దార్ వనజారెడ్డి, ఎంపీడీవో సత్యనారాయణతో కలిసి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడారు. పంటల సాగుకు అవసరమైన అన్ని సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. అనంతరం జైపూర్ మండల పరిషత్ కార్యాలయాన్ని సందర్శించారు. అభివృద్ధి పనులు, ఎల్ఆర్ఎస్ రుసుము, ఆస్తిపన్ను వసూళ్లకు సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈజీఎస్ పనులు వేగవంతం చేయాలని తెలిపారు. ఎల్ఆర్ఎస్ దరఖాస్తులపై రుసూము వసూలు చేయాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట ఎంపీవో బాపురావు, ఎస్ఐ నాగరాజు, ఏపీవో బాలయ్య పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న పీడీఎస్‌యూ నాయకులు

## బడ్జెట్‌లో విద్యారంగానికి తీవ్ర అన్యాయం

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, మార్చి 19 : రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి తీవ్ర అన్యాయం జరిగిందని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జగజంపుల తిరుపతి ఆరోపించారు. విద్యారంగానికి 7.57 శాతం కేటాయించడాన్ని నిరసిస్తూ బుధవారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌక్ వద్ద నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు సుశాంత్ రామ్ చరణ్ తేజ్ అజయ్ వినయ్, అరుణ్ కుమార్, విలాస్ ఉన్నారు.

నస్పూర్, మార్చి 19 : రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగానికి 7.57 శాతం మాత్రమే నిధులు కేటాయించడం సరైంది కాదని, 20 శాతం కేటాయించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీకాంత్ తెలిపారు. ఎన్నికల ముందు రేవంత్‌రెడ్డి విద్యారంగానికి 15 శాతం నిధులు కేటాయిస్తామని చెప్పి, అధికారంలోకి వచ్చిన తర్వాత తక్కువ కేటాయించడం సరికాదని పేర్కొన్నారు. విద్యారంగంపై ఆయనకు శ్రద్ధలేదని ఆరోపించారు.

## కలెక్టరేట్ ముట్టడి ఉద్రిక్తం

- ఆశ కార్యకర్తలను అడ్డుకున్న పోలీసులు
- ఆరు గంటల పాటు ఎండలో ధర్నా

కుమ్రం భీం ఆసిఫాబాద్, మార్చి 19 (నమస్తే తెలంగాణ): ఆశ కార్యకర్తల కలెక్టరేట్ ముట్టడి ఉద్రిక్తంగా మారింది. రెండు రోజులుగా కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట నిరవధిక దీక్షలు చేపట్టిన ఆశ కార్యకర్తలు బుధవారం కలెక్టరేట్ ముట్టడికి యత్నించారు. అప్పటికీ పోలీసులు పెద్ద సంఖ్యలో మోహరించి ప్రధాన గేట్లను మూసివేశారు. దీంతో కలెక్టరేట్ వెనుక వైపు ఉన్న గేటు ద్వారా ఆశ కార్యకర్తలు వెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకోగా తోపులాట జరిగింది. సుమారు గంటపాటు ఉద్రిక్త వాతావరణం నెలకొన్నది. ఆగ్రహంతో కలెక్టరేట్ ప్రధాన గేటు ఎదుట వందలాది మంది ఆశ కార్యకర్తలు బైఠాయించారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఆశ కార్యకర్తలు కలెక్టరేట్ గేటు ఎదుట ఎండలోనే కూర్చొని నిరసన తెలిపారు. కలెక్టర్ వచ్చి తమ డిమాండ్లను వినాలని పట్టుబట్టారు. ఈ సందర్భంగా ఆశ కార్యకర్తల సంఘాల నాయకులు మాట్లాడుతూ ఎన్నికలకు ముందు తమ న్యాయం చేస్తామని హామీ ఇచ్చిన రేవంత్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక తమ సమస్యలను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఆశ కార్యకర్తలకు రూ.18 వేల నిర్దిష్టవేతనం చెల్లించాలని, ప్రమోషన్లు, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత కల్పించాలని, తదితర సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కలెక్టరేట్ వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా ఏఎస్పీ చిత్తరంజన్ పర్యవేక్షించారు.



ఆశ కార్యకర్తలను అడ్డుకుంటున్న పోలీసులు



కలెక్టరేట్ గేటు ఎదుట బైఠాయించి ధర్నా చేస్తున్న ఆశ కార్యకర్తలు